# చిత్రలేఖనంలో జానపదం

27.02.2010

డా. జి. అరుణకుమారి

తెలుగువారి చిత్రకళ చరిత్రను వివరించటానికి గ్రంథస్థ ఆధారాలు లేవు. అనుమాన ప్రమాణాలతోనే నిరూపించవలసి ఉంది. 2600 సంవత్సరాల క్రితం కృష్ణాతీరంలో చేతివృత్తులు, వర్తక వాణిజ్యాలు బాగా పెంపొంది, అక్కడి నుండి కొందరు వర్తకులు బీహారులోని రాజగృహానికి బుద్ధుని సందర్శనార్థం వెళ్ళారు. 'సాతు'లుగా (కరణాలుగా లెక్కలు రాసేవారు సాతు – సాతకర్ణి రూపమని కూడా అంటారు) వెళ్ళారు. వారిలో ఒక చిన్నవాడు చిత్రకళా కుశలుడు. బుద్ధుని అంగీకారంతో యువ చిత్రకారుడు అతనిని ఎండలో నిలబెట్టి తెల్లని కౌశేయం (పట్టు వస్త్రం) మీద నీడను (ఛాయ) పట్టాడు. కుంచె పట్టి గైరిక ధాతువుతో నీడ అంచుక రేఖలు (Out lines) గీసాడు. బుద్ధుని సమక్షంలోనే కను ముక్కు రేఖలు తీర్చాడు. ఎండలో వ్యక్తిని నిలబెట్టి నీడను వస్త్రంపై పట్టినపుడు చిత్రలేఖకుడు, వ్యక్తి ఆ చిత్రపటాన్ని చూడవచ్చు. నీడ పట్టి అంచుక రేఖలు గీసి ఆపైన కను ముక్కు రేఖలు గీయవచ్చు. యువకుని ఉపాయాన్ని, తన రూప చిత్రాన్ని చూస్తున్న బుద్ధదేవునికి కన్నుల్లో కరుణ పెదాలపై చిరునవ్వు విరిసింది. ఆ కన్నులు పెదిమలు చిత్రాల్లో నేటికీ నిలిచిపోయాయి.

ఈ కథ నిజం కావచ్చు, కల్పన కావచ్చు లేదా రెండింటి కలగలుపు కావచ్చు. దేశ విదేశాలలో ఎందరెందరివో చిత్రాలు విగ్రహాలు తయారవుతున్నాయి. కాని అవి ఒక దాని నొకటి పోలవు. కాని బుద్ధుని బొమ్మలు మాత్రం ఏ కాలానివైనా ఒక్క పోలికతోనే ఉంటాయి. బుద్ధ దేవుని నీడపట్టిన తెలుగు యువకుడు రచించిన తొలి చిత్రమే తర్వాత రచనలకు మూలం అయివుంటుందని చెప్పవచ్చు. (చిత్రకళ–రాంభట్ల కృష్ణమూర్తి, ఆంధ్రప్రదేశ్ దర్శిని, పుట 975)

**సాహిత్యం :** క్రీ.పూ. 2 శతాబ్దం – క్రీస్తు శకం 4వ శతాబ్దం వాడని చెప్పే కాళిదాసు మాళవికాగ్ని మిత్రంలోను అగ్ని మిత్రుడు మొట్ట మొదటిసారిగా మాళవికను చిత్రపటంలో చూస్తాడు. 'చిత్రశాలాం గతా దేవీ యదా ప్రత్యగ్ర రాగాం చిత్రలేఖాం అవలోకయంతీ చిరం తిష్ఠతి'. అప్పుడే రంగులు వేసిన చిత్రపటాన్ని ధారిణీదేవి చాలాసేపు వీక్షించింది అని వకుళావళిక చెప్పిన మాటల్లో కాళిదాసు కాలంలో చిత్రలేఖనం ఉందనే విషయం విశదమవుతుంది.

చిత్రకారులు వాడే రంగులను గురించి శ్రీనాథుడు కాశీఖండం మొదటి ఆశ్వాసంలో

"తరిపి వెన్నెలలోన ధావళ్య మొక కొంత
నవ సుధాకర్దమ[1] ద్రవము గాగ
చిన్నారి పొన్నారి చిరుత చీకటి చాయ
అసలు కొల్పిన మషీ రసము[2] గాగ
నిదుర మేల్కాంచిన నెత్తమ్మి మొగడల
తోరంపు పుప్పొళ్ళు అరిదళముగ[3]
తొగరు[4] వన్నియ లేత తొలిసంజె కెంజాయ
కమనీయ ధాతు రాగంబుకాగా....."

(1. తెలుపు 2. నలుపు 3. పసుపుపచ్చ 4. ఎరుపు)

రంగుల్ని కలిపి కొమరు ప్రాయంపు నూనూగు కొదమ యెండ ..... అనే కుంచెతో సూర్యుడు ఈ జగత్తును చిత్రిస్తున్నాడని శ్రీనాథుడు వర్ణించాడు. సూర్యుడు ఎండ అనే కుంచెతో జగత్తును చిత్రిస్తున్నాడని శ్రీనాథుడు నాలుగు వర్ణాలను పేర్కొన్నాడు. జగత్తులో నీల (సముద్రం) వర్ణం, గోధుమ (భూమి) వర్ణం రంగుని పేర్కొనక పోవటానికి కారణం ఏమిటని సందేహం కలగవచ్చు. నలుపు, తెలుపు, ఎరుపు, పసుపుపచ్చ వర్ణాల సమ్మేళనంలో నీలం, గోధుమ రంగులు ఏర్పడతాయనే విషయం విశదమవుతుంది. శ్రీనాథుడు లేత రంగులనే పేర్కొనటం ఆ కాలంనాటి చిత్ర లేఖనంలో ఉండే లేత రంగుల సమ్మేళనాలను సూచించటం విశేషం. ఇందులో సున్నం, మసి, అరిదళం, గైరికం, ఇంగిలీకం రంగులను వాడేవారని ఈ పద్యం వలన తెలుస్తుంది. 'ఇంగిలీక మహిమ హేమింప నేరక చిత్తరువులు రాసి తెలిపినారు' అని వేమన కూడ చెప్పాడు.

శ్రీ జ్ఞానానందకవి ఆమ్రపాలిలో శిల్ప దిగ్గజాల కల్పనలను ప్రశంసించారు.

"ఎవరిదో ఈ చిత్తరువు చూడ ముచ్చటౌ మగధ రాజేంద్రుని దగును గాక<br>
ఈ పటంబెవరిదో యెంతో ప్రసన్న రూపము గానబడు శాక్య ప్రభువు నిజము.<br>
ఎవరిదో ఈ బొమ్మ హేమకుడ్యమ్ముపై లిఖియింపబడె నాట్యసఖి యయారె!<br>
ఈ చిత్రమెవరిదో ప్రాచీన భారత సంస్కృతికీ ప్రశస్త ప్రతీక<br>
అనుచు దలచినారలాత్మల శిల్పదిగ్గజములు తమ చేయు కల్పనలకు<br>
కేవలముగ దివ్య కిమ్మీరముల నామ్రపాలి మెచ్చఁ జేయఁ జాలినారు"

అందంగా చిత్రాలు లిఖించటం ప్రాచీన కాలం నుండి ఉందనే విషయం అందరికీ తెలిసిందే. చిత్ర పటాలను చూసి మోహించి వివాహం చేసుకునే వేడుకను మనం అనేక కావ్యాలలో వస్తువుగా చూస్తున్నాం. అంతటి సౌందర్యం వ్యక్తిదా? కళాకారునిదా? ఎంచి చూడాలి.

విష్ణు ధర్మోత్తర పురాణంలో చిత్ర సూత్ర ప్రకరణంలో సమస్త కళలలో చిత్రమే శ్రేష్ఠం అని పురాణ కర్త తెలిపాడు. శ్రీ కుమారుడు ధూళిచిత్రం, సాదృశ్య చిత్రం, రస చిత్రం అని మూడు రకాల చిత్రాలను పేర్కొన్నాడు. ఋగ్వేదంలో 'చిత్రం దేవానాముదగాదనీకం' – సూక్తంలో మిత్ర వరుణ లోకాలకు చక్షులైన వేయి కిరణాల సమూహ రూపమైన చిత్రం ఉదయాద్రిపై కనిపిస్తుందనే వర్ణన ఉంది. పంచదశిలో చిత్రపటాలు నాలుగు. ధౌతం (ఉతకటం), మండితం (గంజి), లాంఛితం (కాటుక రేఖలు), రంజితం (రంగులతో చిత్రం). చిత్రకారులు వాడే రంగులను గురించి, చిత్రాలను గురించి మన పూర్వీకులు వివరించారు.

ఆంధ్ర రాష్ట్రం చిత్రకళలకు సుసంపన్నమైనది, ప్రకృతి నుండి పొందే రంగులతో పటం (Canvas) మీద చిత్రాలను దిద్దుతారు. చెర్యాల్, కలంకారి, నిర్మల్ చిత్రలేఖనాలు పౌరాణిక గాథల్ని ప్రకృతి సౌందర్యాన్ని మానవాకృతులను అందించాయి.

**చెర్యాల్ :** ఇది జానపదకళ. సంప్రదాయ మెళకువలతో అందమైన రంగులతో రామాయణ మహాభారత గాథలను చెందిన వస్తువును అందిస్తుంది. మీటర్ల కొద్దీ బట్ట మీద కాకిపడగోళ్ళవారు చేస్తారు. ఇప్పుడు చిన్న బట్టమీదగాని, కాగితం, ప్లైవుడ్ చెక్కమీదగాని, అట్టమీదగాని రంగులతో చిత్రాలు వేస్తారు. కథనాత్మక రూపాలు Stony type లో ఉంటాయి. చెర్యాల్ చిత్రలేఖనంలో తక్కువ రంగులు, ముదురు రంగులు వాడతారు.

**నిర్మల్ చిత్రలేఖనం :** లేత రంగులు వాడతారు. ఈ చిత్రలేఖనంలో వాస్తవ అభివ్యక్తి ఉంటుంది. అదిలాబాదులో నిర్మల్ ప్రాంతంలో చేపట్టిన చిత్రకళ కాబట్టి నిర్మల్ చిత్రలేఖనం అని పేరు వచ్చింది. కాంగ్రా, అజంతా, మొగల్.... వంటి భారతీయ శాఖల ప్రభావం నిర్మల్ చిత్రలేఖనం పై కనిపిస్తుంది. నాగా జాతివారు ఈ కళను ఆరంభించారు. 14వ శతాబ్దంలో ముస్లిం రాజులు దీనిని ఆదరించి ప్రోత్సహించారు. వస్త్రాలపై చిత్ర రచన తెలుగు వారి ప్రత్యేకత.

**కలంకారీ చిత్రకళ :** కలం సాధనంతో ముడిపడి ఉన్న కళ. వెదురు కలం నుండి రంగులు బట్టమీద పడేట్టు చేస్తారు. రంగుల సమ్మేళనంతో భారత పురాణ గాథలను రూపుదిద్దుతారు. 17, 18వ శతాబ్దాలలో కలంకారీ కళ ప్రపంచమంతటా ఎగుమతి అయ్యింది, వ్యాపించింది. కలంకారీ ఈనాటికీ కాళహస్తి (చిత్తూరు జిల్లా) మచిలీపట్నం (కృష్ణా జిల్లా)లో ప్రసిద్ధి గాంచింది. కూరగాయల వర్ణాలతో బండి చక్రాలు, చిలుకలు, పద్మాలు ఆకులు పువ్వులు ఈ కలంకారీ చిత్ర కళలోని ప్రత్యేకతలు.

కలంకారీ చిత్రకళ తెలుగు వారి ప్రత్యేకత. ఒక్క బందరులోనే ఆ రోజుల్లో ఎనిమిది వేలమంది వరకు కలంకారీ చిత్రకారులున్నట్లు 16వ శతాబ్దంలో ఫ్రెంచి, ఇంగ్లీషు, డచ్చి, పోర్చుగీసు వారి వలన తెలుస్తుంది. గోల్కొండ నవాబు కలంకారీ కళను తనకే అమ్మాలని నిర్బందించగా, 'నివరకు' చెల్లించని రాజప్రతినిధుల వలన చేతి వృత్తులు సన్నగిల్లాయి. ఈస్ట్ ఇండియా కంపెనీ వాటిని పూర్తిగా నాశనం చేసిందని, తెలుగు చిత్రకళకు గ్రహణం పట్టిందని అన్నారు.

**లఘు (మినియేచర్) చిత్రకళ :** భారతదేశంలో 10వ శతాబ్దంలో వచ్చింది. తాటాకుల మీద చిత్రకళ రూపుదిద్దుకుంది. 14వ శతాబ్దంలో కాగితం మీద చిత్రలేఖనం జరిగింది. రామాయణ మహాభారత గాథలు దీనిలో వస్తువులు. 16వ శతాబ్దం మధ్యకాలంలో మొగలు చక్రవర్తుల దర్బారు, విలాసం, వినోదం, మానవాకృతులు, ప్రకృతి చిత్రాలు ఈ చిత్రలేఖనాలలో కనిపిస్తాయి. ఈ లఘు చిత్రలేఖనానికి రాజస్థాన్, పహారి, మొగల్, దక్కన్... మొదలైన శాఖలు ప్రసిద్ధి చెందాయి. నీటి వర్ణాలతోనే లఘుచిత్రాలను నిర్మిస్తారు. నేడు భారతీయ ముద్ర కలిగిన లఘు చిత్రాలు నాలుగు వందలకు పైగా లండన్ మ్యూజియంలో భద్రపరిచారు.

**తంజావూరు–మైసూరు చిత్రకళ :** భారతీయ కళకు ఆధ్యాత్మికత ప్రాణాధారం. ఇది పాశ్చాత్య చిత్రలేఖనంలో కనిపించదు. మహారాష్ట్ర పాలకుడు శరభోజీ కాలంలో 18వ శతాబ్దం చివర తంజావూరు శైలిగా ప్రసిద్ధి పొందిన చిత్రకళ. దంతం, చెక్క పలకల మీద నీటి వర్ణాలతో చిత్రాలు చిత్రించి, బంగారం, విలువైన రత్నాలు పొదగడం తంజావూరు కళ ప్రత్యేకత. ఈ కళ దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధమైనది. ఇతర చిత్రకళలకు ఇచ్చినంత ప్రాధాన్యం తంజావూరు చిత్రకళకు ఇవ్వకపోవటానికి కారణం సామాన్య మానవునికి అందుబాటులో లేని కళగా గుర్తింపుపొందటమే. సంప్రదాయం, ప్రసిద్ధ సంప్రదాయాల మధ్య విలసిల్లిన కళ. కాగితంపై లేత రంగులతో నమూనాను దిద్దుతారు. కర్రపైన బట్ట పెట్టి చిత్రకళను రూపొందిస్తారు. చిత్రలేఖన ఫలకం ఎత్తుగా ఉంటుంది. సున్నం మెత్తి బంగారు పత్రాలను తాపించి రంగుటద్దాలు, రంగు రాళ్ళు పొదుగుతారు. భక్తితత్త్వాన్ని ప్రతిపాదించే చిత్రకళలు ప్రధానమైనవి.

**రాతి చిత్రకళ (Rock Art Painting) :** కుర్తాళం చిత్రకూటంలో సుమారు వంద చిత్రలేఖనాలు గోడలపై చెక్కినవి ఉన్నాయి. రంగులు అద్దిన కళాఖండాలు జానపదుల సామూహిక జీవనాన్ని, వేట మొదలైన విషయాలను

తెలియజేస్తాయి. కర్నూలు కేతవరంలో రాతిపై ఎర్ర రంగు అద్దిన జింక, కోతి బొమ్మల రూపాలు కనిపిస్తాయి. ఇవి అతి ప్రాచీనమైనవి. క్రీ.శ. 1644–47 సంవత్సరంలో విజయ రాఘవ నాయకుని కాలంలో కుడ్య చిత్రాలు కనిపిస్తాయి.

**భారతీయ చిత్రకళ–పాశ్చాత్య దర్శనం :** పాశ్చాత్య చిత్రకారులు భారతదేశంలోని భిన్న సంస్కృతులను, వైవిధ్యాన్ని, ప్రాంత వాతావరణాన్ని, పరిసరాలను, వన సౌందర్యాన్ని చూసి ఆనందించారు. 13వ శతాబ్దంలో మార్కోపోలో చైనాకు వెళ్ళే మార్గంలో భారతదేశానికి వచ్చి భారతీయ సంస్కృతిని చూసి చిత్రాల మూలంగా పాశ్చాత్యులకు వివరించాడు. పాశ్చాత్యులకు ధనం విలువ తెలుసు. ఆరోజులలో భారతీయులకు డబ్బు విలువ తెలియదు; విదేశాలను జయించాలనే కోరిక లేనివారు.

**యూరోపియన్ యాత్రా చిత్రకారులు :** 17వ శతాబ్దంలో యూరోపియన్లు భారతదేశానికి వచ్చారు. డచ్చి, బ్రిటిషు, పోర్చుగీసు వారు భారతదేశానికి వ్యాపారార్థం వచ్చినపుడు కళాకారులు కూడా వచ్చారు. 30 మంది బ్రిటిషు కళాకారులలో 28 మంది లఘు చిత్రకారులు 1770–1825 మధ్య కాలంలో వచ్చారు. ఈ విధంగా వచ్చినవారిలో జాన్ జోఫానీ (John Joffany), విలియం హోడ్జెస్ (William Hodges), టిల్లి కెటెల్ (Tilly Kettle), విలియం (William), థామస్ డేనియల్ (Thomal Daniel), ఎమిలీ ఈడెన్ (Emily Eden) ప్రముఖులు. వీరి చిత్రలేఖనాలు కొలకత్తాలోని విక్టోరియా మెమోరియల్‌లో 1760 నుండి 19వ శతాబ్దం వరకు యాత్రికులుగా వచ్చి మన దేశంలోని రాజులు, సామాన్య మానవులు, దర్బారులో నృత్యకారులు, కోలాటాలు, జానపదులు, వృత్తికారులు, శ్రామికులు, వ్యాపారాలు, పెంపుడు జంతువులు మొదలైన అంశాలకు చెందిన చిత్రలేఖనాలను వేలకు పైగా చిత్రించి ప్రపంచానికి పరిచయం చేసారు. తైలవర్ణ చిత్రాలు, నీటి రంగులు, పెన్, పెన్సిలు సమ్మేళనాలు చిత్రలేఖనాలలో కనిపిస్తాయి. చిత్రలేఖనం దిగజారిన సందర్భంలో బ్రిటిషువారు 18–19 శతాబ్దంలో Company School స్థాపించి స్థానిక చిత్రకారులను ప్రోత్సహించారు. కంపెనీ చిత్రలేఖనాలను మద్రాసు ప్రెసిడెన్సీలో ప్రదర్శించారు. 18వ శతాబ్దంలో చిత్రకారులు వేసిన చిత్రలేఖనాలు అనేకం భారతదేశం నుండి యూరప్‌కి పంపించేవారు. ఇవి సంస్కృతికి, తత్త్వదర్శనానికి, పరిశోధనలకు కేంద్రమయ్యాయి. ఇండియన్ టీ అత్యంత ప్రీతికరమైనదిగా గుర్తింపుపొందింది. భారతదేశంలో యూరప్‌లో లేని వైవిధ్యం కనిపించటం వలన పలువురు పాశ్చాత్యులు ఉండిపోయారు.

18వ శతాబ్దంలో పసుపుపచ్చని క్వెరిసటిన్ (Quercetin Bark), పసుపు రంగు గాసిపెటిన్ (Gossipetin) పత్తిమొక్క, ఎరుపు రంగు ఎలిజరీన్ (Alizarin) ముంజిష్ట (Maddur Tree), నీలి రంగు ఇండిగో ఫెరా (Indigo Fera) మొక్కల నుండి తయారుచేసే అద్దకపు రంగులు ఇతర దేశాలకు ఎగుమతి అయ్యేవి.

**చిత్రలేఖనం–సాహిత్యం :** కాలానుగుణంగా సాహిత్యంలో ఎన్ని మార్పులు వచ్చాయో, చిత్రలేఖనంలోను అన్ని మార్పులు వచ్చాయి. మతపరమైన చిత్రలేఖనాలు, రాజదర్బారులు, విలాసాలు, వినోదాలు, ప్రకృతి సౌందర్యం, మానవ ప్రధానం ఇవన్నీ సారూప్య కళలకు వస్తువులయ్యాయి. 17, 18 శతాబ్దాలలో సారూప్య కళ (Representational Art) నిలిచింది. 19వ శతాబ్దంలో వైరూప్యకళ (Distorted Art), నైరూప్యకళ (Abstract Art) ఆధునికతకు తావిచ్చింది. 1840లో కెమెరా వచ్చి చిత్రలేఖనానికి కొత్త కోణాన్ని అందించింది.

1. భగవంతుడు, భక్తి, ప్రకృతి 2. రాచరిక పరిపాలన 3. శృంగారం 4. సమాజం 5. వ్యక్తి ప్రధానం

అని ప్రతిపాదిత చిత్రకళలను పరిశీలించవచ్చు. ఆధునిక కాలంలో వచ్చిన కొన్ని ఇజాలకు... సర్రియలిజం, క్యూబిజం, దాడాయిజం, ఇంప్రషనిజం, ఫ్యూచరిజం మొదలైన సాహిత్య ధోరణులన్నీ చిత్రకళల నుండి ఉత్పన్నమైనవే.

ప్రాచీన కాలంనుండి ఆధునిక కాలం వరకు సాహిత్యానికి చిత్రలేఖనానికి మధ్య కాలానుగతంగా సామ్యం కనిపిస్తుంది. పైన పేర్కొన్న విభజన సాహిత్యంలోను చిత్రలేఖనంలోను సమకాలికంగా ప్రతిఫలించటాన్ని గుర్తించవచ్చు.

**చిత్రలేఖనంలో జానపదం-ఆచార సంప్రదాయాలు :** జానపద కళలకు మౌఖిక, లిఖిత రూపాలు మూలమని చెప్పవచ్చు. వీటి పరిరక్షణకు చిత్రలేఖనం కూడా ఆధారమని నిరూపించవచ్చు. కొందరు పాశ్చాత్యులు 17-18 శతాబ్దాల మధ్యకాలంలో జానపద కళలకు చేసిన సేవలలో ఎన్నదగినది చిత్రలేఖనం. కొలకత్తా విక్టోరియా మెమోరియల్‌లో గమనించిన చిత్రపటాలను ఉదాహరణంగా పేర్కొంటున్నాను.

ఆచార సంప్రదాయాలకు నిలయాలుగా భావింపబడే దేవాలయాలు మధురమీనాక్షి ఆలయం, కుతుబ్‌మినార్, అజంత గుహలు, కైలాశనాథ్ ఆలయం, జైన ఆలయం, సముద్రతీర ప్రాంతాలు, మానవాకృతులు, జంతువులు ఉన్నాయి. తిరుపర కిన్రం మధురకు సమీపంలో ఉన్న దేవాలయం. ఇది పట్టణం కాదు. పల్లె వాతావరణమే. ఇది సుబ్రహ్మణ్యస్వామి దేవాలయానికి ప్రసిద్ధమైనది. కాని దీనిని విష్ణుదేవాలయంగా డానియల్ పేయింటర్ పేర్కొన్నారు. గుడి ఆవరణలో ఢంక పొడవైన జుట్టు విరబోసుకున్న ఒక భక్తుడు మోకాలిపై వరకు వస్త్రధారణ గలిగి వెనుదిరిగి ఉన్నవాడు కనిపిస్తాడు. భక్తి ఆవేశాలతో శివాలయాలలో కనిపించే పోతురాజు రూపును చిత్రీకరించారు. ఆలయ పరిసరాలు శైవాలయంగా కనిపించినా పాశ్చాత్య చిత్రకారుడు విష్ణు ఆలయంగా పేర్కొనటం పరిశీలనార్హమైనది.

**సంప్రదాయం-ఆచారాలు :** సాలెవారు, స్వర్ణకారులు, మంగలి, కుమ్మరి మొదలైన వృత్తికారుల వృత్తి చిత్రలేఖనాలు ఉన్నాయి. 1786-87 నాటి చిత్రలేఖనంలో బరోడాలో బియ్యం అమ్మే వర్తకుడిని చూడవచ్చు. ఆయా వృత్తుల వారు చేసే పనులు, ఉపయోగించే పనిముట్లు ఈ చిత్రలేఖనంలో గమనించవచ్చు. మగ్గం నేసే వారుపయోగించే చుంచు, పడుగు, పేక, నాడె, కండె మొదలైన పరికరాలను క్షురకర్మ చేసే వారుపయోగించే వస్తువులను, వ్యక్తులను వర్ణిస్తున్నాయి. ఆ రోజుల్లో చిత్రకారులు కూడా శ్రామికవర్గంలోనివారుగానే పరిగణింపబడేవారు. చిత్రకారుల కళ్ళకు చేతులకు కీడు తలపెట్టిన వారికి శిరశ్ఛేదం విధించేవారు. టైగర్ అనే చిత్రకారుడు 1798లో తమలపాకులకు సున్నం రాస్తూ భుజాన సంచి, తలపాగా చుట్టుకొని పొడవైన బక్కపలుచని వ్యవసాయదారుడి చిత్రపటాన్ని చిత్రించాడు. దక్షిణ భారతదేశంలో దక్కన్ ప్రాంతవాసి హిందూ వ్యవసాయదారుడి చిత్రపటం కనిపిస్తుంది. జానపదులు నాట్లువేయటం, శ్రామికుల జీవనం చిత్రలేఖనంలో వస్తువుగా కనిపిస్తుంది.

ఈస్ట్ ఇండియా ఫ్యూషన్ తూర్పు భారతీయ సమ్మేళనం అనేది బ్రిటిషువారు వచ్చిన తరువాత ఏర్పడిందని అంటారు. ఈస్ట్ ఇండియా కంపెనీవారు వచ్చిన విధానంలో భాగంగా 17, 18 శతాబ్దం నాటి మధుర, ఢిల్లీ, బాంబే, కలకత్తా, మద్రాసు నగరాలతో ఉన్న వాణిజ్య సంబంధాలను, సముద్ర వ్యాపారాలను చిత్రించే సందర్భంలో బ్రిటిషువారి ఆధిపత్యాన్ని శ్రామికుల జీవనాన్ని చిత్రలేఖనంలో వర్ణించటం ఈ పటాలలో కనిపిస్తాయి. సముద్రతీరం నుండి బోయలు దొరలను పల్లకీలలో మోసుకురావటం, బెస్త స్త్రీ నెత్తి మీద పెద్ద చేపను మోసుకొని వెళ్ళే చిత్రం, హిందూ స్త్రీ అరటి ఆకులో చేపకూడును భర్తకు తీసుకురాటం చిత్రలేఖనాలలో కనిపిస్తున్నాయి. ఇవి శ్రమజీవనాన్ని, వృత్తిని, ఆహారపుటలవాట్లను తెలిజేస్తున్నాయి.

విలియం కార్పెన్టర్ పెన్సిలు వాటర్ కలర్స్‌తో హిందూ బైరాగుల చిత్రాన్ని గీసాడు. 'Religious mandicants preparing for festival' అని జానపద కళాప్రదర్శనకు ముందు ముఖానికి రంగులు వేసుకుంటున్న జానపదులు, బైరాగుల చిత్రం అది. చిన్న గుడి వెనుకగా కొంత దూరంలో గుడిసె ముందు స్త్రీ, పురుషులు, పిల్లలు ఉన్న చిత్రపటాన్ని బాంబేలో మహాలక్ష్మిగుడి దగ్గర ప్రాంతంగా గుర్తించారు.

సిడిమాను ఆట శైవ భక్తికి నిదర్శనం. తెనాలి రామకృష్ణుడు పాండురంగ మహత్యంలో సిడి ఆటను గూర్చి వివరించాడు. సురవరం ప్రతాపరెడ్డి ఆంధ్రుల సాంఘిక చరిత్రలో ఈ ఆటను ఆత్మహింసా పూరితమైన భక్తి ప్రధాన ప్రదర్శనంగా పేర్కొన్నారు. దేవతలకు తమ మొక్కుబడులు చెల్లించుకోవటానికి సిడిపై భక్తులు వేలాడేవారు. రాయల కాలంలో వర్ణ, తైల చిత్రాలను స్త్రీలు కూడా చిత్రలేఖనం వేసేవారని విదేశీయుడు రజాక్ రచన వలన తెలుస్తుంది. గానుగ సున్నంలో కరక్కాయ, బెండకాయ, పాచితీగల రసం, తుమ్మ చెక్క, నీరు కలిపి సున్నం తయారు చేసేవారు. ఇసుకలో బెల్లం నీరు, చమురు, సున్నం గానుగ పట్టి గోడపై గచ్చు వేసి చిత్తరువులను రాసే సంప్రదాయం రాయల కాలంలో ఉన్నట్టుగా చరిత్ర తెలియజేస్తుంది.

రాయలనాటి వైదుష్యంలో సిడిమాను ఆట ప్రస్తావన కనిపిస్తుంది. ఈ సిడిమాను ఆటను చిత్రించే చిత్రలేఖనమొకటి విక్టోరియా మెమోరియల్‌లో కనిపిస్తుంది. మిసెస్ బెల్‌నోస్ (Belnos) సిడిమాను ఆటకు కొంతమంది పురుషులు ఉపక్రమిస్తున్న ఘట్టాన్ని చిత్రించారు. ఇనప కొక్కాలను శరీరంలో ఎక్కడ పడితే అక్కడ గుచ్చుకోవటం కనిపిస్తుంది. సిడిమానును చరకపూజ అని కూడ వ్యవహరిస్తారని, దీనిని చట్టరీత్యా 1840లో నిషేధించారనే వివరాలను ఈ చిత్రలేఖనం అందిస్తుంది.

విలియం టేసి 1829లో కలం, వాటర్ కలర్స్‌తో చిత్రించిన చిత్రంలో 1803–1806లో సామ్యుల్ రసెల్ మద్రాసు ఇంజనీరులతో కట్టించిన (కోఠి ఉమెన్స్ కాలేజికి పూర్వ రూపం) నిర్మాణాన్ని సూచించాడు. దీని నిర్మాణానికి నిజాం అర్థిక వనరులు అందించాడు. 'Procession outside the main entrance of the residency' గా పేర్కొన్నాడు. ఈ చిత్రలేఖనంలో ఏనుగు అంబారీ ఊరేగింపు, ప్రహరీ గోడకు గుళ్ళకు వేసే ఎర్రని చారలు కనిపిస్తాయి. ఇదొక చారిత్రక ఆధారం.

సర్దార్ పాపారాయుడు జానపద గౌడ పురాణ వీరగాథలలో నాయకుడు. ఇతని చిత్రపటం లండన్ మ్యూజియంలో ఉంది. తెలుగు విశ్వవిద్యాలయం వారు ఆ చిత్రపటాన్ని తెప్పించి ఖిలాషాపురంలో విగ్రహాన్ని ప్రతిష్టించారు.

**ముగింపు :** చిత్రలేఖనాలను ఆధారంగా చేసుకొని జానపదాంశాలను సేకరించవచ్చు. జానపద సాహిత్యానికి కళలకు చిత్రలేఖనాలు ఆధారాలుగా నిలుస్తాయని చెప్పవచ్చు. పరిశోధనలో ఆంతర విద్యావిషయిక పరిశోధనలు (Inter-disciplinary methods), బహు విద్యావిషయిక పరిశోధనలు (Multi-disciplinary methods), సమగ్ర విద్యావిషయిక పరిశోధనలు (Trans-disciplinary methods) చేపట్టవచ్చు. చిత్రలేఖనంలో జానపదాంశాల పరిశోధనకు సాహిత్యం, చరిత్ర, చిత్రలేఖనం రంగాలతో పరిచయం, సమన్వయం అవసరం. పరిశోధనల విస్తృతి పెరగాలి. ఈ పరిశోధనలకు ఇంటర్‌నెట్ గొప్పసాధనమవుతుంది. (నా కొలకత్తా యాత్రలో భాగంగా 3 జనవరి 2010 నాడు సందర్శించిన విక్టోరియా మెమోరియల్ ఈ వ్యాస రచనకు ఆధారం).